ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 6 జూన్ 2024

తెగిపడిన కరెంట్ వైరు
విద్యుదాఘాతంతో రైతుతోపాటు గేదెలు మృతి
8లో..

8లో..
పర్యావరణ పరిరక్షణ
అందరి బాధ్యత

ఓడినా.. పుంజుకున్న బీజేపీ



- అసెంబ్లీ ఎన్నికల కంటే 24.93 శాతం పెరిగిన ఓట్లు
- 12 శాతానికి పైగా ఓట్లను కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్
- ధర్మపురి నియోజకవర్గంలో సీఎం సభ జరిగినా కాంగ్రెస్ వెనుకంజ
- రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో బోటాబోటీ మెజార్టీ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే భారతీయ జనతా పార్టీ పుంజుకోగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ఓట్లు తగ్గిపోయాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకపోవడం, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలనే భావనతోనే ఆ రెండు పార్టీలకు గాకుండా బీజేపీకి ఓట్లు వేసినట్లు కనబడుతున్నది. మే 13న నాలుగోవిడతలో తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ నెల 4వ తేదీన దేశవ్యాప్తంగా ఎన్నికల కౌంటింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేపై 1,31,364 ఓట్లతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇక్కడి నుంచి మొత్తం 42 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీజేపీ అభ్యర్థి గొమాసేల మధ్య ట్రయాంగిల్ ఫైట్ జరిగింది. కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమేనని, రెండో స్థానంలో బీఆర్ఎస్, మూడో స్థానంలో బీజేపీ ఉంటుందని అంతా భావించారు. పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు అనూహ్యంగా బీజేపీ పుంజుకున్నది. బీజేపీ అభ్యర్థి పెద్దగా ఓటర్లకు తెలియక పోయినా మోదీ మానియా, అయోధ్య రామాలయం, రాముడి అక్షింతలు చాలా ప్రభావితం చేశాయి. దీంతో వ్యాపారులు, వర్తకులు, బ్రాహ్మణులు, వైశ్యులు, మార్వాడీలు, ఉద్యోగ వర్గాలు, యువ ఓటర్లు, మహిళలు బీజేపీకి ఓటు వేసినట్లుగా కనబడుతున్నది. బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. తమ పార్టీ అభ్యర్థి రెండు లక్షలకు పైగా మెజారిటీ సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పుకున్నప్పటికీ వారి అంచనాలు తలకిం దులయ్యాయి. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా అభ్య ర్థులకు పోలైన ఓట్ల వివరాలను ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ బుధవారం విడుదల చేశారు. ఈ వివరాలను పరిశీలించినట్లయితే ఈ ఎన్ని కల్లో బీజేపీ బాగా పుంజుకున్నది. వాస్త వానికి ఆ పార్టీకి ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో 79,324 (6.47శాతం) ఓట్లు పోలయ్యాయి. ఎంపీ ఎన్నికల్లో 3,44,223 (31.40 శాతం) ఓట్లు వచ్చాయి. అంటే 2,64.899 ఓట్లు, 24.93 శాతం పెరగడం గమనార్హం.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు, ఆయా పార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలు..

నియోజకవర్గం	పోలైనవి	కాంగ్రెస్	శాతం	బీజేపీ	శాతం	బీఆర్ఎస్	శాతం	ఆధిక్యం	పార్టీ
1. పెద్దపల్లి	1,82,830	74,091	40.52	68,766	37.61	27,272	14.91	5,325	కాంగ్రెస్
2. మంథని	1,67,750	87,237	52.00	32,711	19.49	34,156	20.36	54,526	కాంగ్రెస్
3. రామగుండం	1,35,330	55,472	40.99	45,341	33.50	27,578	20.37	10,131	కాంగ్రెస్
4. ధర్మపురి	1,69,272	57,633	34.04	66,221	39.12	32,075	18.94	8,586	బీజేపీ
5. మంచిర్యాల	1,69,591	79,101	46.64	59,716	35.21	21,614	12.74	19,387	కాంగ్రెస్
6. చెన్నూర్	1,32,787	59,489	44.04	33,775	25.28	26,743	20.13	25,714	కాంగ్రెస్
7. బెల్లంపల్లి	1,25,255	57,157	45.63	32,577	26.00	22,453	17.92	24,580	కాంగ్రెస్
మొత్తం	10,96,020	4,75,587	43.39	3,44,223	31.40	1,93,356	17.64	1,31,364	కాంగ్రెస్

● ధర్మపురి నియోజకవర్గంలో బీజేపీకి ఆధిక్యం..

గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు విజయం సాధించగా, కాంగ్రెస్ గెలుపు నల్లేరు మీద నడకేనని భావించారు. అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీదే ఆధిపత్యం కొనసాగుతుందని ఆశించారు. కానీ అనూహ్యంగా ధర్మపురి నియోజకవ ర్గంలో కాంగ్రెస్‌పై 8,586 ఓట్ల ఆధిక్యాన్ని బీజేపీ సాధించడం గమనార్హం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 12.25 శాతంతో 1,34,262 ఓట్లు, బీఆర్ఎస్ పార్టీ 12.80 శాతంతో 1,40,290 ఓట్లను కోల్పోవాల్సి వచ్చింది. ఇందులో 2,64,899 ఓట్లు భారతీయ జనతా పార్టీకి షిఫ్ట్ అయ్యాయి. ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని రాజారాంపల్లిలో ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహించగా, అదే నియోజకవర్గంలో కాంగ్రెస్ కంటే బీజేపీకి ఎక్కువ ఓట్లు రావడం చర్చనీయాంశంగా మారింది. పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి 25 వేలకు పైగా అధికంగా ఓట్లు వస్తాయని భావించినప్పటికీ అంచనాలు తలకిం దులయ్యాయి. పెద్దపల్లిలో 5,325 ఓట్లు మాత్రమే కాంగ్రెస్‌కు అధికంగా వచ్చాయి. ఈ ఫలితాల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనకు 31,380 ఓట్ల మెజారిటీ రాగా, ఇప్పుడు 54,526 ఓట్ల మెజారిటీ తీసుకు వచ్చారు. మంత్రిగా తానేమిటో నిరూపించుకున్నారు. చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాలలో మెజారిటీలు ఆశించిన మేరకే వచ్చాయి. పెద్దపల్లి, రామగుండంలో తగ్గడంతో డేంజర్ బెల్స్ మోగుతున్నట్లేనని అనుకుంటున్నారు. మరో మూడు, నాలుగు మాసాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఆ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు ఫలితాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు భారతీయ జనతా పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల్లో మరింత జోష్ పెంచింది.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

- బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గొమాసే

పెద్దపల్లిటౌన్, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో ఓడినా నియోజకవర్గంలోనే ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గొమాసే మాట్లాడారు. ఆరు నెల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే ఇప్పుడు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ భారీగా ఓట్లు పెరిగాయని పేర్కొన్నారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో 6,312 ఓట్లు వచ్చాయని ఇప్పుడు 68,766 ఓట్లు వచ్చాయన్నారు.బ అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 79,000 ఓట్లు రాగా, ఇప్పుడు మూడు లక్షల 42 వేల పైచిలుకు ఓట్లు బీజేపీకి వచ్చాయన్నారు. తనకోసం పాటుపడ్డ ప్రతీకార్యకర్తకు, ఓటు వేసిన ప్రజానీకానికి ధన్యావాదాలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోనే ఉండి ప్రజల సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ నెలలో 20 రోజులు నియోజ కవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శిలారపు పర్వతాలు, గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, రాజగోపాల్, రాజం మహంతకృష్ణ, ఉప్పు కిరణ్, శివాజి, శ్రీనివాస్, ఈర్ల శంకర్, లక్ష్మన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



మణెమ్మను ఓదార్చుతున్న మనాలీ ఠాకూర్

అంతర్గాం, జూన్ 5: రామగుండం పట్టణంలోని 1వ డివిజన్ ఏరియా ఆదర్శనగర్‌లో మంగళవారం గాలివాన బీభత్సానికి బట్టారి మణెమ్మ, లక్ష్మీపతి దంపతుల రేకుల ఇల్లు పైకప్పు కొట్టుకుపోయింది. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయ కుల ద్వారా సమాచారం అందుకున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ బుధవారం బాధిత కుటుంబాన్ని బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లికొండ రాజేష్, ఈదునూరి హరి ప్రసాద్, మహ్మద్ బాకు, రమేష్, నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం: మాజీ మంత్రి కొప్పుల



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని, తిరిగి బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతామని, ప్రజల మధ్యనే ఉంటామని ఈశ్వ ర్ చెప్పారు. తనకు పార్లమెంట్ అభ్యర్థిత్వాన్ని కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌కు ఈశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడమే తనకు గొప్ప అవకాశంగా ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంత సమస్య లు తెలిసిన వ్యక్తిగా, సింగరేణి మాజీ ఉద్యోగిగా తాను గెలిస్తే ఈ ప్రాంతంలో అనేక సమస్యలు పరిష్కరించే అవకాశం ఉండేదని ఈశ్వర్ చెప్పారు. సింగరేణి గని కార్మికుల సమస్యలు, అసంఘటిత కార్మిక రంగ సమస్యలు, పార్లమెంట్ ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న సమస్యలపై పరిష్కరించే ఉద్దేశంతో పార్ల మెంట్ ఎన్నికల్లో ప్రజల దగ్గరికి వెళ్లామన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు జాతీయ పార్టీలైనా బీజేపీ, కాంగ్రె స్ వైపు మొగ్గు చూపారని ఆయన చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదరించి ఓటు వేసిన ప్రజలకు, ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన బీఆర్ఎస్ శ్రేణులకు, మాజీ శాసనసభ్యులకు, తెలంగాణవాదులకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జెడ్‌పీటీసీ నారాయణ, నాయకులు పీటి స్వామి, గోషు ఐలయ్యయాదవ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, జూన్ 5: ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత ప్రతీఒక్కరికి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అందజేయనున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ధర్మారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన వారికి గృహాలు మంజూరవుతా యని ఆయన తెలిపారు. పెద్దపల్లి ఎంపీగా వంశీకృష్ణను గెలిపించిన ప్రతీఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి ఎంపీతో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చే యనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షు డు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

గర్రెపల్లిలో బీరన్న పట్నాలు

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూన్ 5: మండలంలోని గర్రెపల్లిలో బుధవారం బీరన్న పట్నాల ఉత్సవాలను జరుపుకున్నారు. కుర్మ గొల్ల కులస్థుల ఆరాధ్య దైవమైన బీరన్న వేడుకలలో కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు బీరన్న పట్నాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేతో పాటు ఎంపీటసీ పులి అనూష తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశం, తిరుపతి యాదవ్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల దందాను ఉపేక్షించేది లేదు

- మహారాష్ట్ర నుంచి రవాణా అవుతున్న 2.5క్వింటాళ్ల పత్తి విత్తనాల పట్టివేత - రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



నకిలీ విత్తనాలు, నిందితుని అరెస్టు చూపుతున్న పోలీసులు

కోల్‌సిటీ, జూన్ 5: రైతులను నట్టేట ముంచుతున్న నకిలీ విత్తన దందాను ఉపేక్షించేది లేదని, విత్తన దందా చేస్తున్న వ్యాపారులు, రవాణా దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరిం చా రు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి ప్రాణహిత ఫెర్రి పాయింట్ వద్ద బుధవారం తెల్లవారుజామున మహారాష్ట్రనుంచి ఎడ్లబండ్లలో రవాణా అవుతున్న 2.5క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు సీపీ తెలిపారు. బుధవారం స్థానిక కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన నకిలీ విత్తనాల పట్టివేత, అరెస్టు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిర్వంచ ప్రాంతానికి చెందిన కోల రమేష్(50), అతని కుమారుడు కోల సాయికిరణ్ (23) అనే వ్యక్తులు కొంతకాలంగా మంచిర్యాల జిల్లా కోటపల్లిలో నివాసముంటున్నారన్నారు. వారు మహారాష్ట్రకు చెందిన సుమిత్, జంగ సంపత్, వద్ద నకిలీ పత్తి విత్తనాలను కొని మంచిర్యాల జిల్లాలో రైతులకు అమ్మాలని ప్ర యత్నిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా బుధవారం తెల్లవారుజామున ఎడ్లబండి లో నకిలీ విత్తనాలు తీసుకువస్తుండగా నీల్వాయి ఎస్ఐ శ్యాంపటేల్, కానిస్టేబుళ్లు నాగేందర్, శేఖర్, మరికొందరు సిబ్బంది వేమనపల్లి వద్ద వ్యవసాయ అధికారితో కలిసి మాటువేశారన్నారు. ఎడ్లబండి ద్వారా విత్తనాలు రాగానే పట్టుకున్నారని, విత్తనాలు రవాణా చేస్తున్న కోల సాయికిరణ్(23)ను అరెస్టు చేశామన్నారు. అత ని తండ్రి రమేష్ పరారయ్యాడన్నారు. ఇతని వద్ద నుంచి 6.75లక్షల రూపాయల విలువైన నకిలీ పత్తివిత్తనాలు, ఎడ్ల బండి, ఎద్దులను స్వాధీనం చేసుకున్నామన్నా రు. కేసులో రమేష్, సుమిత్, జంగ సంపత్ పరారీలో ఉన్నారన్నారు. వారంలో మూడు నకిలీ పత్తి విత్తనాల రవాణాను పట్టుకున్నట్లు సీపీ వెల్లడించారు. మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాలు రవాణా జరుగుతున్నట్లు గుర్తించామని, అక్కడ కూడా త్వరలోనే దాడులు చేస్తామన్నారు. నిందితులపై పీడీ యాక్టు కూడా నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు. కాగా నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ వరి విత్తనాలు సరఫరా చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలు పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ శ్యాంపటేల్, కానిస్టేబుళ్లు రాజేందర్, రాజశేఖర్‌ను సీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యాంపటేల్ పాల్గొన్నారు.

గాలి దుమారానికి విరిగిన చెట్లు

- విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఓదెల, జూన్ 5: మండలంలో మంగళవారం రాత్రి వీచిన గాలి దుమారానికి చెట్లు విరిగిపడ్డాయి. ఓదెల నుంచి హరిపురం గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు రోడ్డుపై విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్రమైన ఆటంకం ఏర్పడింది.

అలాగే మూడు గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడటం వల్ల కండక్ట్ కేబుల్ తెగి విద్యుత్ స్థంభాలు ధ్వంసమయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్రమైన ఆటంకం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



రోడ్డుపై విరిగిపడిన చెట్లు

గాడి తప్పిన నగర పాలన

- శాఖల్లో ఎవరి రాజ్యం వారిదే..

- ఫొటోలే తప్ప పర్యవేక్షణ లేని పారిశుధ్య విభాగం

- వివాదస్పద ఉద్యోగులకు కీలక బాధ్యతలు

కోల్‌సిటీ, జూన్ 5: రామగుండం నగరపాలన పూర్తిగా గాడి తప్పింది. పౌరులకు సేవలందించలేని దుస్థితికి చేరింది. నగరపాలన అంటే పారిశుద్యం, వీధి దీపాలు, మంచినీటి సరఫరా, అవినీతి రహిత సేవలు, మౌలిక సదుపాయాలనే భావన యంత్రాంగంలో కొరడవుతుందనే విమర్శ లున్నాయి. కార్పొరేషన్‌లోని ప్రధాన శాఖల్లో ఎవరి రాజ్యం వారిదే అనే రీతిలో వ్యవహారాలు సాగుతున్నాయి. నగరపాలనలో పౌరులకు సేవలందిం చడం కంటే ఫొటోలతోనే పని అనే రీతిలో వ్యవహారం సాగుతోందని ప్రజాప్రతినిధులే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్రధానమైన పారిశుధ్య విభాగంలో ఫొటోలే తప్ప పారిశుధ్య నిర్వహణలేని దుస్థితి నెలకొన్నది. ఇంటింటా చెత్త సేకరణ అటుంచి ఎక్కడ చూసినా చెత్త అనే రీతిలో పారిశు ధ్య విభాగం పని తీరు ఉంది. పారిశుధ్య విభాగానికి ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా, ఎవరు ఎక్కడ పర్యవేక్షణ చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. ఉదయం 6, 7గంటలకు విధులకు రావడం, ఫొటోలు తీసుకుని వెళ్లిపోవడం పరిపాటి అయ్యిందనే విమర్శలున్నాయి. డివిజన్ల వారీగా వార్డు ఆఫీసర్లను పెట్టినా వారు పూర్తిస్థాయిలో విధుల్లోకి రాని పరిస్థితి ఉంది. ఏదైనా సమస్యలు పారిశుధ్య విభాగానికి సంబంధించి కీలకమైన సమస్యలు పరిష్కారం విషయంలో పనులు ముందుకు సాగడం లేదు.

● పాలనపై పట్టు సాధించని కమిషనర్....

రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్‌గా సీహెచ్ శ్రీకాంత్ విధుల్లో చేరి మూడున్నర నెలలు అయినా పాలనపై పూర్తిగా పట్టు సాధించలేదనే విమర్శలు వస్తున్నాయి. కీలకమైన శాఖలపై పట్టులేకపోవడంతో ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో కాంట్రాక్టర్లే కమిషనర్ చాంబర్‌లో గొడవలు పడిన ఉదంతాలు ఉన్నాయి. అకౌంట్స్ విభాగంలో బిల్లుల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విషయపై నిలదీసిన పరిస్థితులు ఉన్నాయి. ఒక కీలక అధికారి తన ఇష్టానుసారంగా బిల్లులు రాస్తున్నారని, అవుట్ సోర్సింగ్ కార్మికులను సొంత పనులకు వాడుకుంటున్నా కమిషనర్ పట్టించుకోవడం లేదనే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. నగరపాలనలో గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులకు కీలక బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. డీజిల్ వ్యవహారంలో నెలకు నాలుగు లక్షల రూపాయలకుపైగా అడ్జెస్ట్‌మెంట్లు జరుగుతన్నాయనేది బహిరంగ రహస్యమైంది. ఒకే ఒక బంక్‌లో డీజిల్ ఖాతా పెట్టడం, గతంలో అదే బంక్‌లో 10లక్షల రూపాయల నుంచి 15లక్షల రూపాయల డీజిల్ బిల్లుల విషయంలో గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలున్నాయి. పారిశుధ్య విభాగంలో ఆగ్రోస్ నుంచి కొనుగోలు చేసిన వాహనాలకు బయటకు తీయకున్నా వాహనాల్లో డీజిల్ పోసినట్టు బిల్లులు సృష్టించి 15లక్షల రూపాయలు గోల్‌మాల్ చేసిన ఉదంతంపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. పైగా కొందరు ప్రజా ప్రతినిధులు ఇదే బంక్‌లో తమ సొంత అవసరాలకు డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించలేదని, వాటిని సర్దుబాటు చేయాల్సి ఉన్నదని యజమాని ఒత్తిడి మేరకే ఆ బంక్‌కు మళ్లీ ఖాతా పెట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. డీజిల్ తమ వాహనాల్లో తక్కువ పోసి ఎక్కువ పోసినట్టు రికార్డు చేసుకుం టున్నారని వాహనాల డ్రైవర్లే ఆరోపిస్తున్న పరిస్థితి ఉంది. కమిషనర్ ప్రజా ప్రతినిధులను, అధికారులను సమన్వయం చేయలేకపోవడం వల్ల వివాదాలు చెలరేగుతున్నాయి. తమ ఫోన్లకు స్పందించడం లేదంటూ పలువురు కార్పొరేటర్లు నిలదీసిన పరిస్థితి నెలకొన్నది. కమిషనర్ సైతం పారిశుధ్య పనుల పర్యవేక్షణకు ఫీల్డ్‌పైకి వస్తున్నా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



● ఆదాయం పెంపుపై దృష్టేది...

రామగుండం నగరపాలక సంస్థలో ఆదాయం కంటే వ్యయం ఎక్కువ ఉన్న పరిస్థితి ఉంది. ఆదాయ మార్గాలపై యంత్రాంగం దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. ముఖ్యంగా ఏటా .2.5కోట్ల రూపాయల నుంచి మూడు కోట్ల రూపాయల ఆదాయం వచ్చే ట్రేడ్ లైసెన్స్ వసూళ్లపై యంత్రాంగం స్పందించడం లేదు. ఇంత వరకు కార్పొరేషన్‌లో ఒక మద్యం షాపు నుంచి కానీ, రైస్ మిల్లు నుంచి కానీ, ఫంక్షన్‌హాల్ నుంచి కానీ ట్రేడ్ లైసెన్స్ వసూలు చేసిన పరిస్థితులు లేవు. కార్పొరేషన్‌లో డిప్యూటేషన్‌పై వివిధ విభాగాల నుంచి ఉద్యోగులు వచ్చి చేతినిండా పనిలేక ఖాళీగా ఉంటున్నా ఒకరిద్దరు ఉద్యోగులకే ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల బాధ్యతలు అప్పగించారు. ఇక మార్కెట్ అద్దెలు కోటి రూపాయలకు పైగా బకాయిలు ఉన్నా వసూలు చేసిన పరిస్థితి లేదు.

నీట్ ఫలితాల్లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, జూన్ 5: నీట్-24 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత మార్కులతో జయకేతనం ఎగురవేశారని అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని అల్ఫోర్స్ కళాశాలలో నీట్‌లో అత్యు త్త మ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నీట్‌లో ఎస్. హేమంత్ 691 మార్కులు, వి.హాసిని 671, డి.పూజిత 650, ఎస్.కౌశిక్ రెడ్డి 647, పి.అక్షర రెడ్డి 639, వి.శ్రీముఖి 619, మరియాసబ 619, ఏ.శ్రీవర్ధిని 613, ఎం.కమాలికా ప్రీతి 613, ఎస్.జ్ఞానద 604, ఎ.అమరేందర్ 598, బి.హాసిత 595, కె.శ్రీవిద్య 582, ఎం.డి.అఫ్జాన్‌ఖాన్ 579, ఎస్.సాయిప్రతిజ్ఞ 573, ఎం.ప్రతిమ 571, పి.శ్రీనాథ్ 566, షేక్ ఉమ్రా 561, తేజస్విని 560, మహీన్ నజ్మీన్ 560 మార్కులు సాధించారన్నారు. కె.సుహృదాషవ పి.డబ్ల్యుడి కేటగిరిలో జాతీయస్థాయిలో 675వ ర్యాంకు సాధించారన్నారు. నీట్ కోచింగ్‌లో డాక్టర్స్- 30 ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా కోచింగ్ అందించిన రెండో సంవత్సరంలో 10 మంది విద్యార్థులకు 600లకు పైగా మార్కులు రాగా, 20 మందికి 560 ఆపై మార్కులు, 41 మందికి 500 పై మార్కులు, 86 మందికి 450పై మార్కులు సాధించడం విశేషమన్నారు. పటిష్ఠ ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, అకుంఠిత దీక్షతో నీట్‌లో అద్భుత ఫలితాలు సాధించారని విద్యార్థులను,తల్లిదండ్రులను, అధ్యాపకులను నరేందర్‌రెడ్డి అభినందించారు.



అల్ఫోర్స్ కాలేజీలో నీట్ టాపర్స్‌ను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

'శ్రీచైతన్య' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

కరీంనగర్ టౌన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో స్థానిక శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి లో అద్భుత మార్కులు సాధించినట్లు కళాశాల డీన్ జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముజామిల్ ఖాన్ 633, సిహెచ్.చందన 533, అజ్మీరా రాజు 530, మిట్ట సిరివెన్నెల 524, కాలబోయిన అర్జున్ 517, రెశ్వంత్‌రెడ్డి 510 మార్కులు సాధించారన్నారు. అలాగే 400లకు పైగా మార్కులను 15 మంది వి ద్యార్థులు సాధించడమే కాకుండా పరీక్షకు హాజరైన వారిలో 60శాతం మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారని తెలిపారు. అనునిత్యం పర్యవేక్షణ, నీట్ పరీక్ష నిర్వహించే వరకు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడం వల్లనే విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించారన్నారు. బుధవారం కళాశాలలో నీట్‌లో సత్తా చాటిన విద్యార్థులు వారికి సహకరించిన తల్లిదండ్రులను, శ్రీచైతన్య అధ్యాపక బృందాన్ని చైర్మన్ రమేశ్‌రెడ్డి అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరు పతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్ రావు, ఎంజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ముత్తారం జూన్ 5: జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి అక్రమంగా తరలిస్తున్న 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం తెల్లవారు జామున ముత్తారం మండలంలోని కాసర్ల గడ్డ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారి మంథని రవీందర్ రాథోడ్ ముత్తారం గ్రామంలో ఒక వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాసింపల్లి గ్రామానికి చెందిన దుగ్యాల సమ్మయ్య కొంతకాలంగా తక్కువ రేటుకు రేషన్ బియ్యాన్ని గ్రామస్థుల దగ్గర కొని ఎక్కువ రేటుకు అమ్ముకొని లాభం పొందుతున్నాడు. అదే క్రమంలో బుధవారం అంబాల అనిల్‌కు చెందిన ఓ వ్యానులో రేషన్ బియ్యాన్ని పెద్దపల్లికి చెందిన ఆంజనేయులు, రాజు తరలిస్తుండగా సివిల్ సప్లై అధికారి ముత్తారం రోడ్డు వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.



నిందితుల అరెస్టు చూపుతున్న సివిల్ సప్లై అధికారులు, పోలీసులు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వెండి, బంగారం ఆభరణాలు, రూ. లక్ష అపహరణ

కోరుట్ల, జూన్ 5: పట్టణంలోని అనంద్‌గిరినగర్ ప్రాంతం లోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగినట్లు కాలనీవాసులు, పోలీసులు బుధవారం తెలిపారు. కాలనీకి చెందిన పందిరి మురళి - కవిత దంపతులు మంగళవారం సాయత్రం ఇంటికి తాళంవేసి మేడిపల్లి మండలంలో రాజలింగపేట గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటి తులుపులు తీసి ఉన్న విషయం గమనించిన చట్టు పక్కల వారు చోరీ జరినట్లు గుర్తించి వారికి సమాచారం అందించారు. సమాచారం అందుకు న్న కవిత కుటుంబ సభ్యులు వెంటనే ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళం పగులడొట్టి ఉండి ఇంట్లో సామగ్రి చిందర వంద రగా పడి ఉంది. బీరువాలో చూడగా అందులో ని ఐదుతులాల వెండి, తులం బంగారు అభరణాలతో పాటు లక్ష నగదు అపహరణకు గుర్రైనట్లు బాధితులు తెలిపారు. దీంతో కాలనీ వాసుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బంది తో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

'నీట్'లో ట్రినిటి విద్యార్థుల జయకేతనం

కరీంనగర్ టౌన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో స్థానిక ట్రినిటి జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. బుధవారం నగరంలోని ట్రినిటి కళాశాలలో ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకులను సాధించిన విద్యార్థులను అభినందించారు. ట్రినిటి విద్యార్థులు ముసాబ్ హుస్సేన్ 685 మార్కులు, బి.నిఖిల్ 681, సయ్యద్ ముజ కిర్ అలీ 676, ఎం.శశాంక్ 671, ఎ.ఆదిత్య 670, ఎ.కిరణ్ సింగ్ 667, పి.సందీప్ కుమార్ 665 మార్కులు, ఆర్.అజిత్ కుమార్ 657 మార్కులు, వివేక్ సిద్దార్థ 655 మార్కులు, ఎస్.మాళవిక 651 మార్కులు, ముజమ్మిల్ ఖాన్ 633 మార్కులు, వి.స్ఫూర్తి 599 మార్కులు, జె.కీర్తన 582 మార్కులు, వి.రాహుల్ 567 మార్కులు, సహరిష్ ఐమాన్ 558 మార్కులు, ఎస్.గంగశ్రీ 542 మార్కులు, ఆర్.ఆలేహ్యా 538 మార్కులు, ఎం. శ్రీజ 538 మార్కులు, పి.ప్రణయ్ 537 మార్కులు, సిహెచ్.విఘ్నేష్ 536 మార్కులు, ఈయేషా మహజబీన్ 535 మార్కులు, వై.అశ్లేష 532 మార్కులు, పి.శ్రీదీప 523 మార్కులు, హెచ్.కులకర్ణి 522 మార్కులు, సిహెచ్. సాయి మెహిత్‌రెడ్డి 507 మార్కులు, ఎస్‌కె గౌస్‌పాషా 505 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో పటిష్టమైన ప్రణాళికతో, ఒత్తిడి లేని విద్యా విధానంతో ఈ ర్యాంకులు సాధించడం వీలైందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సి పాల్స్, అధ్యాపక బృందం ర్యాంకులు సాధించిన విద్యార్థు లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నీట్ ర్యాంకర్‌ను అభినందిస్తున్న ట్రినిటి అధినేత దాసరి మనోహర్‌రెడ్డి



నిఖిల్ వెన్ను



సయ్యద్ అలీ



ఆదిత్య ఆనంద్



శశాంక్ మౌర్య

బస్సు ఢీకొని బాలుడి మృతి

జగిత్యాలరూరల్, జూన్ 5: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన మామిడాల మనీష్ (5) అనే బాలుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మోరపల్లి గ్రామానికి మామిడాల మనీష్ అనే బాలుడు గ్రామంలో దుకాణానికి వెళ్లాడు. పండ్లు కొనుక్కొని తిరిగి తన ఇంటివైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో రాయికల్ వైపు నుంచి జగిత్యాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు బాలుడిని ఢీకొట్టడంతో బస్సు వెనుక టైర్ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగన్న ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్లగా తల్లి ఇంటి వద్దనే బాలుడితో కలిసి ఉంటుంది. మృతుడి తల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాలుడి మృతికి కారణమైన వారిని శిక్షించి నష్టపరిహారం చెల్లించాలని సుమారు గంట పాటు రోడ్డుపైన మృతుడి బంధువులు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ ఆలీఖాన్, ఎస్సై సధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



మనీష్ (ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల మృతి

ఇబ్రహీంపట్నం, జూన్ 5: ఇబ్రహీంపట్నం మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన బైరి సృజన్(29) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజేశ్వర్‌రావు పేట గ్రామానికి చెందిన బైరి సృజన్, జంగిటి శ్రీకాంత్‌లు ద్విచక్ర వాహనంపై రాజేశ్వర్‌రావుపేట నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్నారు. మేడిపల్లి వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమణించి హుటాహుటిన మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్రడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ అసుపత్రికి తరలించారు. ఆసు పత్రిలో చికిత్స పొందుతూ బైరి సృజన్ మృతి చెందాడు. మరో యువకుడు శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీస్‌లు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు.



సృజన్ (ఫైల్)

పొరండ్లలో మరో యువకుడు..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామ శివారులో కండ్లపల్లి సాయిరాజ్ (22) అనే యువకుడిని బుధవారం బొలెరో వాహనం వేగంగా ఎదురుగా వచ్చి బైక్‌ను బలంగా ఢీకొన్న సంఘటనలో రాయికల్ మండలం చింతలూర్ గ్రామానికి చెందిన సాయిరాజ్ అనే యువకుడికి తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సాయిరాజ్ తన ద్విచక్రవాహనంపై రాయికల్ మండలంలోని తన స్వగ్రామం చింతలూర్ నుంచి జగిత్యాలకు పని నిమిత్తం వెళ్తుండగా మార్గమధ్యలోని పొరండ్ల వద్ద ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. మృతుడు సాయిరాజ్ తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ అద్దెబస్సు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), జూన్ 5: తంగళ్లపల్లి మండలం పద్మ నగర్ గ్రామ శివారులో ఆర్టీసీ అద్దెబస్సు బుధవారం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ప్రయాణికులు క్షేమంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. సిద్దిపేట ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు బుధవారం తెల్ల వారుజామున 34 మంది ప్రయాణికులతో వేములవాడకు బయల్దేరింది. తంగళ్లపల్లి మండలం పద్మ నగర్ శివారులో డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడుపడంతో స్టీరింగ్ లాక్ పడింది. దీంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లి ఆగిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో సురక్షితంగా బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని పోలీసులు, ఆర్టీసీ అధికారులు పరిశీలించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రాయికల్, జూన్ 5: రాయికల్ పట్టణానికి చెందిన బైరి రాజశేఖర్ (65) మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. పట్టణానికి చెందిన రాజశేఖర్‌కు ఇద్దరు కుమారులున్నారన్నారు. ఈ కుటుంబానికి గత కొంతకాలంగా ఆస్తి పంపకాల గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలోనే ఈ నెల 4న రాత్రి రాజశేఖర్‌కు, పెద్ద కొడుకు నరేష్‌కు మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. ఈ సమయంలో ఇరువురు ఒకరినొకరు పెనుగులాడుకున్నారని, ఈ పెనుగులాటలో రాజశేఖర్ అదుపు తప్పి కిందపడగా, అక్కడే కుప్ప కూలిపోయాడని ఎస్సై వివరించారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని, అయితే రాజశేఖర్ గుండె నొప్పితో చనిపో యి ఉండవచ్చని లేదా ఇతర కారణాల వల్ల మృతి చెంది ఉండవచ్చని మృతుని భార్య కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే రాజశేఖర్‌కు మూడేళ్ల క్రితం గుండె ఆపరేషన్ జరిగిందని కుటుంబీకులు తెలిపారని ఎస్సై వివరించారు.



రాజశేఖర్ (ఫైల్)

గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం

గంగాధర, జూన్ 5: మండలంలోని ఉప్పరమల్యాలకు చెందిన నందరగిరి రమేష్ (35) మే 10న దుబాయిలో మృతి చెందాడు. ఆయన మృతదేహం బుధవారం స్వ గ్రామానికి చేరింది. రమేష్‌ను ఓ ఏజెం టు 60 వేలు తీసుకుని విజిట్ వీసాపై దుబాయికి పంపించాడు. దుబాయిలో ఏడు నెలలు గడిచినా పని దొరకకపోవడంతో మానసింగా కృంగిపోయాడు. రెండు నెలల నుంచి పని లేక పోవడంతో మనస్తాపం చెందాడు. దీంతో ఆయ న ఆరోగ్యం దెబ్బతిన్న ది. తీవ్ర అనారోగ్యంతో మే 10న మృతి చెందాడు. ఆయన మృత దేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. రమేష్‌కు ఆరు లక్షల రూపాయల వరకు అప్పులున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పెద్దపల్లిటౌన్, జూన్ 5: జిల్లాలోని పలు ఆసుపత్రులలో వైద్య సిబ్బందికి అగ్ని ప్రమాదాలు సంభవించ కుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డి.శ్రీనివాస్ పెద్దపల్లి పట్టణంలోని సాయి వంశీ, ఆర్కే హాస్పిటల్స్ నందు వైద్యులకు, వైద్య సిబ్బందికి ఎలక్ట్రికల్ ఫైర్స్ సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీ సిస్టమ్, ఎమర్జెన్సీ డోర్ కలిగి ఉండాలని సూచించారు. . ముఖ్యంగా ఆసుపత్రులలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రోగులను రక్షించే విధానం వైద్య సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ మాన్ ఎండి. ప్రవీణ్ కుమార్, హోం గార్డు ఎండి. అజ్జు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్సెస్సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

పెద్దపల్లిటౌన్, జూన్ 5: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ హిందీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 14 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, కేవలం ఒక్క విద్యార్థి హాజరైనట్లు తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని డీఈవో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, జూన్ 5: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్), ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ మధ్య కొనసాగుతున్న ట్రిపుల్ విన్ పార్టనర్ షిప్‌లో భాగంగా జర్మన్ భాష శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీలో రిక్రూట్‌అయ్యే నర్సుల కోసం జూన్10 లోగా జర్మన్ భాషా శిక్షణలో ప్రత్యేక ట్రైనింగ్, ఎన్రోల్మెంట్ ప్రోగ్రాం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిఎన్ఎమ్, బీఎస్సీ కోర్సు చేసి 21 నుంచి 38ఏళ్ల మధ్య వయస్సు కలిగి తెలంగాణలో గుర్తింపు పొందిన కళాశాలల నుంచి నర్సింగ్, ఐసీయూ, జెరియాట్రిక్స్ ఆర్థోపెడిక్స్ సైకియాట్రి, కార్డియాలజీ, నియో నాటల్, సర్జికల్ వార్డు మొదలగు వాటిలో కనీసం 3 సంవత్సరాల ప్రొఫెషనల్, క్లినికల్ పనిచేసిన అనుభవం కలిగిన వారితో పాటు జర్మన్ భాష నైపుణ్యం కలిగిన వాళ్ళు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8919047600, 9908830438, 7032379066, 8499990304నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు కోరారు.

'ఎమ్మార్పీఎస్ మద్దతుతోనే బీజేపీకి భారీగా ఓట్లు'

కాల్వశ్రీరాంపూర్, జూన్5: ఎమ్మార్పీఎస్ మద్దతుతోనే బీజేపీకి మండలంలో భారీగా ఓట్లు పడ్డాయని జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉండడంతో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సామాజిక వర్గంతో పాటు 59 ఉప కులాలను బీజేపీకి ఓటు ఓటు వేయాలని పిలుపునిచ్చారన్నారు. దీంతో మండలంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగి ఎనిమిది ఎంపీ సీట్లు గెలుచుకోగలిగిందన్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వెయ్యి ఓట్లను దాటని బీజేపీ 8వేల ఓట్లు వచ్చాయన్నారు. మందకృష్ణ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నాయకులంతా గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించినట్టు తెలిపారు. బీజేపీకి ఓట్లు వేసిన వారందరికీ ఎంఆర్‌పీఎస్ తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కోండ్ర వివేక్, కనుకుంట్ల ఆకాష్, శంకర్, రమేష్, సాగర్, లింగమూర్తి పాల్గొన్నారు.

గోవుల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలి

మంథని, జూన్ 5: గోమాతల, నందీశ్వరుల రక్షణ కోసం పోలీస్ శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని శ్రీగౌతమేశ్వర గో సంరక్షణ సమితి నిర్వాహకులు ఆకుల విద్యాసాగర్ ఎస్ఐకి బుధవారం వినతి పత్రం అందజేశారు. కొందరు గోవులను, నందీశ్వరులను అక్రమంగా తరలిస్తున్నందున చెక్ పోస్టు ఏర్పాటు చేయడం తోపాటు అలాంటి వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపీగా వంశీకృష్ణ గెలుపుపై హర్షం

మంథని, జూన్ 5: పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు పొందడం పట్ల మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్‌లు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో మంథని ప్రాంతంలో ఎంపీ వంశీ గెలుపు కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులందరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే స్ఫూర్తితో అధిక స్థానాల్లో పార్టీ మద్దతు దారులు గెలుపొందే విధంగా కృషి చేయాలని వారు కోరారు.

జేఎన్టీయూలో ఐసెట్ ప్రవేశ పరీక్ష



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి, జూన్ 5: తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఐసెట్ ప్రవేశ పరీక్ష బుధవారం మంథని జేఎన్టీయూ కళాశాలలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో మొదటి రోజు 150 మందికి 139 మంది, మధ్యాహ్నం 150 మందికి 141 మంది పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

లీడ్ క్యాప్స్ జిల్లా అధ్యక్షుడిగా సంతోష్

కళ్యాణ్‌నగర్, జూన్ 5: తెలంగాణ మాదిగ చర్మకారుల లెదర్ పరిశ్రమల (లీడ్ క్యాప్) జిల్లా అధ్యక్షుడిగా పుల్లూరి సంతోష్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్ బుధవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ జాతి ప్రయోజనాలు, వఋుత్తి హక్కులను కాపాడుతూ మాదిగ చర్మకారుల చైతన్యానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండయ్య, కొమురయ్య, భూమయ్య, రమేష్, సంపత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఓదెల, జూన్ 5: మండల కేంద్రానికి చెందిన కనగంటి లక్ష్మీపతి(36) అనే యువకుడు కరీంనగర్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. రెండు రోజుల క్రితం తన ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

పొత్కపల్లిలో పునుగు పిల్లి సంచారం

ఓదెల, జూన్ 5: మండలంలోని పొత్కపల్లిలో రెండు రోజుల నుంచి పునుగు పిల్లి సంచరిస్తోంది. దీంతో వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఐదు రోజుల క్రితం ఓదెల మండలం పిట్టల ఎల్లయ్యపల్లి, గోపరపల్లి, ఓదెల గుట్ట సమీపంలో పునుగు పిల్లి సంచరిస్తూ కుందేళ్లపై దాడి చేస్తుంది. పొత్కపల్లి రైల్వే గేటు వద్ద మంగళ వారం రాత్రి సీసీ ఫుటేజిలకు పునుగు పిల్లి చిక్కింది. వెంటనే అటవీ శాఖ అధికారులు స్పందించి పునుగు పిల్లిని పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా నాగవెల్లి మహోత్సవం

పాలకుర్తి, జూన్ 5: మండలం పరిధిలోని జయ్యారం గ్రామ బీరప్ప ఆలయంలో బీరప్ప నాగవెల్లి మహోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బీరప్ప కామరతి దేవి నాగవెల్లి మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవుల ఇళ్లు తమతమ బంధువులు, కుటుంబ సభ్యులతో నిండి పోయాయి. ఇతరప్రాంతాల్లో ఉంటున్న వారు సైతంకార్యక్రమానికి హాజరు కావడంతో గ్రామంలో సందడి పెరిగింది. గ్రామంలో కుర్మ కళాకారులు రాత్రి సమయంలో వినిపిస్తున్న కథలను వినేందుకు గ్రామస్థులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసి పోయింది. మహిళలు బోనాలు ఎత్తుకొని రావడం, కుర్మ పూజారుల నృత్యాలు పలువురిని ఆక ట్టుకున్నాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం





మొక్కలు నాటుతున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు, జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు

జ్యోతినగర్, జూన్ 5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఎన్టీపీసీ యాజమాన్యం బుధవారం ఘనంగా నిర్వహించింది. ఈసందర్భంగా ఈడీ కేదార్ రంజన్‌పాండు మాట్లాడారు. వాతావరణ మార్పుల కారణంగా అనేక ఉపద్రవాలు వస్తున్నాయని అన్నారు. వాతావరణ సమతుల్యత దెబ్బతినడంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నట్టు తెలిపారు. పర్యావరణాన్ని నాశనం చేయడం కారణంగా ఇటువంటి విపత్తులను చవిచూడాల్సి వస్తున్నదని, మంచి ప్రకృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఈడీ పేర్కొన్నారు. మొక్కల పెంపకాన్ని ఉద్యమంగా చేపట్టాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈసందర్భంగా టౌన్‌షిప్‌లో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు, గుర్తింపు, కార్మిక సంఘం నాయకులు కృష్ణయ్య, రాజశ్వర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సూచించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, అధికారులు, సిబ్బంది గోదావరిఖని పట్టణంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి మెయిన్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీటి సంరక్షణ, నిషేధిత ప్లాస్టిక్ వాడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పీసీబీ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ బిక్షపతి మాట్లాడుతూ నేల పునరుద్ధరణ, ఎడరీకరణ, కరువును తట్టుకోవడం అనే లక్ష్యాలను ఈ ఏడు ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పర్యావరణానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సింగరేణి పర్యావరణ విభాగం అధికారులు సురేష్‌బాబు, రాజిరెడ్డి, కిశోర్, ఎన్టీపీసీ అధికారి విశాల్, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు సత్యనారాయణ, క్రిస్నిందు, చింకు రామిని, దీపక్ సామ్యేల్, జీపీపీపీజీ అధ్యక్షుడు భీమ్‌సేన్ పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలి..

కళ్యాణ్‌నగర్: ప్రతిఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం వైద్య కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని, వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. మానవాళి మనుగడ కొనసాగాలంటే మొక్కలు పెంచాలని, ఇతరులకు కూడా పెంచే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు నరేందర్, వేణుమాధవ్, రాజు, రవి వర్మ, శిరీష, అరుణ, అప్పారావు, భాను లక్ష్మి, అనీల్, శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య, ఆసిఫ్, షరీఫ్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మండలంలోని నిమ్మనపల్లి, నిట్టూరు, అప్పన్నపేట, రాఘవపూర్‌తో పాటు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు మొక్కలు నాటారు.

రామగిరి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని నాగేపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో బేటి బచావో, బేటీ పడావో అనే అంశం పై మహిళా సాధికారత కేంద్రం జనరల్ సెక్రెటరీ చంద్రు స్వప్న గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్, టీచర్లు సుగుణబాయి, లావణ్య, ఆయాలు వసంత, మల్లీశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

● ప్రకృతి ప్రేమికుడికి అభినందన..

మంథని: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రెవెన్యూ డివిజన్‌లో కార్యాలయంలో మంథనికి చెందిన ప్రకృతి ప్రేమికుడు గట్టు కృష్ణమూర్తిని ఆర్డీవో హనుమా నాయక్ బుధవారం అభినందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృష్ణమూర్తి రోడ్ల పక్కన సొంత ఖర్చులతో మొక్కలను నాటించడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను సైతం నిత్యం పర్యవేక్షించడంపై ఆర్డీవో హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. కార్యక్రమంలో డీఏవో తూము రవీందర్ పాల్గొన్నారు.

● సింగరేణి ఏరియాలో..

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురసరించుకుని అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ప్రకృతిని కాపాడుకుంటేనే జీవించగలమని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒకరి బాధ్యత అని జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం, వాహనాల వినియోగాన్ని, విద్యుత్ వినియోగాన్ని తగ్గించేలా ప్రయత్నించాలని సూచించారు. అనంతరం జీఎం ఆఫీస్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

● ఓసీపీ-1 ప్రాజెక్టు బేస్‌వర్క్‌షాప్‌లో బుధవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం జరిగింది. ఆర్జీ-3 పర్యావరణ అధికారి కిషన్, హెచ్‌ఓడీ అజీజ్‌లు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల కరపత్రాన్ని ఆవిషరించారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీలు సదానందం, రమేష్, నాయకులు ఐ శ్రీనివాస్, రవీందర్, జక్కుల దామోదర్‌రావు, కిషన్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిలుగా హాజరై పర్యావరణ ప్రతిజ్ఞ చేపట్టారు. సింగరేణి సంస్థ చైర్మన్ బలరామ్ పర్యావరణంపై విడుదల చేసిన సందేశ పత్రాన్ని అందరికి చదివి వినిపించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, ఎలీషా, సీతారామం, శ్రీనివాసులు, రఘుపతి, సత్యనారయణ, కర్ణ, చంద్రశేఖర్, పద్మరాజు, జానర్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్జీ-2లో పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు, ప్రిన్సిపాల్



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు

చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు సన్మానం

కోల్‌సిటీ, జూన్ 5: చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌ను బుధవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదరబోయిన రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గోదావరిఖనికి వచ్చిన వివేక్‌కు కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. కార్యక్రమంలో గడ్డం శేఖర్, లక్ష్మీపతిగౌడ్, యాద వెంకటరమణ, సతీష్, కల్వల శంకర్, లక్ష్మణ్, నారాయణ, శ్రీనివాస్, పవన్, పంజా శ్రీనివాస్, మాలెం మధు, కోట రామస్వామి, ప్రసాద్ ఉన్నారు.

బైక్ చోరీ

కాల్వ శ్రీరాంపూర్, జూన్ 5: మండలంలోని మొట్లపల్లి గ్రామ పంచాయితీ కార్యదర్శి కంకణాల రాజేష్ కుమార్ చెందిన రెడ్ కలర్ గ్లామర్ బైకు(టీఎస్22 7508)ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న రాజేష్‌కుమార్ ఇంటి ముందు పెట్టిన బైకు తెల్లవారిసరికి లేకపోవడంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జూన్ 5: మండలంలోని నీరుకుళ్ల మానేరు వాగు ప్రాంతంలో బుధవారం రాత్రి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మానకొండూరు మండలం ఊటూరు గ్రామానికి చెందిన బొమ్మనవేని సతీష్ అనే యువకుడు నీరుకుళ్ల మానేరు ప్రాంతానికి వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఆ విషయం తన స్నేహితులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వెంటనే సంఘటన స్థలానికి స్నేహితులు చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న సతీష్‌ను సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ అస్పత్రికి తరలించారు. కాగా సతీష్ కరీంనగర్‌లో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో కేర్ టేకర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, జూన్ 5: పెద్దపల్లి మున్సిపాలిటి కౌన్సిలర్ కొంతం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని రాఘవపూర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించగా పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించిన అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే సంప్రదించండి

- విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి సుదర్శన్

పెద్దపల్లిటౌన్, జూన్ 5: జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఏదైనా అంత రాయం ఏర్పడితే వెంటనే సంబంధిత అధికారులను ఫోన్లో సంప్రదించాలని పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకూరిరి సుదర్శన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు ఏ విధమైన విద్యుత్ సమస్యలు ఉన్నా వెంటనే సంబంధిత సెక్షన్ అధికారికి, విద్యుత్ బిల్లులకు సంబంధించిన సమస్యలు ఉంటే సంబంధిత అసిస్టెంట్ అకౌంట్ అధికారికి ఫోన్ ద్వారా తెలియజేస్తే వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రతీ నెల వినియోగదారులకు అందించే కరెంట్ బిల్లులలో సెక్షన్ అధికారి, అసిస్టెంట్ అకౌంట్ అధికారి ఫోన్ నంబర్లు ముందు భాగాన కింద ప్రింట్ చేసి ఉంటాయని, వినియోగదారులు గమనించి వారి సమస్యలకు ఫోన్లో సంప్రదించాలన్నారు. వినియోగదారులు తప్పనిసరిగా సంబంధిత సెక్షన్ ఏఈ ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంచుకోవాలని, విద్యుత్ అంతరాయాలు కలిగిన, ఏవైనా సమస్యలు ఉన్న ఫోన్ చేయాలని సూచించారు. విద్యుత్ ప్రజావాణి ప్రతీనెల మొదటి బుధవారం నిర్వహిస్తామన్నారు. దానికి అనుగుణంగా బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించామన్నారు. అదే విధంగా ప్రతీనెల మొదటి బుధవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని చీకురాయి రోడ్డు ఎదురుగా ఉన్న సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ సెక్షన్ కార్యాలయంలో వినియోగదారుల ఫిర్యాదులను నమోదు చేసుకునేందుకు రిజిస్టర్ అందుబాటులో ఉందన్నారు.

విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 1912 లేదా 180004250028 నందు ఫిర్యాదు చేయ వచ్చని, పెద్దపల్లిలోని సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 7901628367 ద్వారా కూడా వినియోగ దారులు తమ సమస్యలు తెలియజేయ వచ్చన్నారు. వర్షం పడే సమయంలో, ఉరుములు మెరుపులు సంభవించినప్పుడు విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం ఉంటుందని, విద్యుత్ లైన్ల కింద ఉండవద్దన్నారు. పొలంలో వైర్లు కిందికి ఉంటే సమాచారాన్ని వెంటనే ఏఈ లేదా లైన్ మ్యాన్‌కు తెలియజేయాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శన్ సూచించారు.

ఎండిపోయిన వృక్షానికి నిప్పు



మండుతున్న చెట్టు

పెద్దపల్లి రూరల్, జూన్ 5 : పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ వెళ్లే దారిలో హన్మం తునిపేట గ్రామ శివారులో ఎండిపోయినా వృక్షానికి గుర్తు తెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో అది ఇపుడు రోడ్డుకు అడ్డంగా కూలిపోయే ప్రమాదం ఉంది. పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్, జమ్మికుంట వైపు నిరంతరం వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ సమయంలో రహదారికి ఆనుకోని ఉన్న వృక్షం నిప్పు అంటుకో ని ఎప్పుడో కూలుతుందో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే చర్యలు చేపట్టాలని వాహనదారు లు, ప్రజలు కోరుతున్నారు.

మారుతీనగర్‌లో తెగిపడిన కరెంట్ వైరు

- విద్యుదాఘాతంతో రైతుతోపాటు నాలుగు గేదెలు మృతి



రైతు నూనె కనుకయ్య మృతదేహం



మృతిచెందిన గేదెలు

సుల్తానాబాద్, జూన్ 5: మండలంలోని కనుకుల గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం మారుతీనగర్‌లో తెగిపడి ఉన్న కరెంట్ వైరును తాకి రైతుతోపాటు నాలుగు గేదెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతీనగర్‌కు చెందిన నూనె కనుకయ్య (62) అనే రైతు తన నాలుగు గేదెలను బుధవారం ఉదయం మేతకు తీసుకుపోయాడు. సాయంత్రం అయినా ఎంతకూ రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆయన కోసం వెతకగా మారుతీనగర్ శివారులో నాలుగు గేదెలు చనిపో యి ఉన్న విషయాన్ని గమనించారు. ఆ పక్కను రైతు కనుకయ్య మృతదేహం కూడా పడి ఉంది. ఈ సంఘటన బుధవారం రాత్రి వెలుగు చూసింది. కరెంట్ వైర్లు తెగి పడి ఉన్న కారణంగా వాటిని గమనించని రైతు తన గేదెలతో అటు వైపు వెళ్తూ వైరును తాకడంతో మృతి చెందినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు.

కోలేటి దామోదర్ జన్మదిన వేడుకలు

అంతర్గాం/కోల్‌సిటీ టౌన్ జూన్ 5: రామగుండం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద, రైల్వే స్టేషన్ సమీపంలోని తబితా అనాథ ఆశ్రమంలో బుధవారం రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ జన్మదిన వేడుకలను వైశ్య సంఘం నాయకులు, బీఆర్ఎస్ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్ వద్ద స్వీట్లు, పండ్లు పంపిణీ చేయగా తబితా అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం ప్రతినిధులు వైకుంఠం, శ్రీనివాస్, శ్యాంసుందర్, శశిధర్, కృష్ణమూర్తి, బీఆర్ఎస్ నాయకులు మడ్డి అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణ చౌరస్తాలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నటరాజశేర్ కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రవీందర్, డా. లక్ష్మీవాణి, శ్రీని వాస్, కిషోర్, గాదె స్రవంతి, వీరేశం పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ అభిమానుల సంబరాలు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 5: జనసేన అధినేత, సినీ హీరో పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం తెలంగాణ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన కూటమి గెలవడం, పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో పిఠాపురం నుంచి విజయం సాధించడం సంతోషకరమైన విషమని తెలిపారు. సాంబారి రాజేష్, కండెం సురేష్, అవినాష్, బండారి శ్రీనివాస్, నాగేందర్, కుమార్ పాల్గొన్నారు.

ముత్తారంలో కాంగ్రెస్ నాయకులు...

ముత్తారం జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి ఎంపీగా గెలుపొందిన సందర్భంగా ముత్తారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బుధవారం బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశానుసారం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేసి మండలంలో 4000 పైచిలుకు మెజార్టీ సాధించామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



అద్దె వాహన యజమానుల సమ్మె



నిలిచిన వాహనాలు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 5: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి భూనిర్వాసిత అద్దె వాహన యజమానులు బుధవారం సమ్మెకు దిగారు. వాహనాలను నడపకుండా నిలిపివేశారు. అనంతరం యజమానులు జీఎం ఆఫీస్ వద్ద నిరసనకు దిగారు. సీఎంపీఎఫ్ చెల్లింపు విషయంలో తాము సుప్రీంకోర్టును ఆశ్రయించామని, దీంతో సింగరేణి యాజమాన్యం మే 2023 నుండి ఇవ్వాల్సిన బిల్లులలో 15 శాతం మొత్తాన్ని ఆపివేసి, మిగతా మొత్తాన్ని చెల్లిస్తున్నట్టు యజమానులు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం ఏప్రిల్ 2024 నుంచి సీఎంపీఎఫ్ కట్టడానికి సిద్ధంగా ఉన్నామని యాజమాన్యానికి తెలియజేశాని పేర్కొన్నారు. కానీ మే 2023 నుంచి బిల్లుల నుంచి రికవరీ చేసిన 15శాతం మొత్తాన్ని తిరిగి ఇవ్వడంలో యాజమాన్యం స్పందించడం లేదని పేర్కొన్నారు. యూనిట్ రేట్ పెంచి కొత్త వాహన టెండర్లు ఆహ్వానించారని, ప్రస్తుతం నడుస్తున్న వాహనాలకు రేట్లు పెంచాలన్నారు. నడుస్తున్న వాహనాల కాలపరిమితిని ఐదేళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వాహన యజమానులు పేర్కొన్నారు. నిరసనలో ముస్కాల నాగరాజు, వెంకటేష్, సారయ్యానాయక్, బండారి నాగరాజు, శేఖర్, సంజీవ్, అఫ్సర్, బషీర్, కిషోర్ పాల్గొన్నారు.

దుమ్ము నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 5: ఓసీపీ-3 సీహెచ్‌పీలో దుమ్ము నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఐఎన్‌టీయూసీ బృందం సీహెచ్‌పీని సందర్శించింది. ఫీడర్‌లలో పెద్దఎత్తున పొగ, దుమ్ముతో కార్మికులు పనిచేయలేని పరిస్థితి ఉన్నట్టు ఆయన తెలిపారు. దుమ్ము కారణంగా గోదావరిఖని, కాలనీ ప్రధాన రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. కార్మికుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. సీహెచ్‌పీ ఇంచార్జి సదానందంను కలిసిన ఐఎన్‌టీయూసీ బృందం దుమ్ము నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కండేయ, దశరథం, అవినాష్, రమేష్, బాలయ్య, రవీందర్, పాష ఉన్నారు.